ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
ఆదివారం 4 ఫిబ్రవరి 2024


జొన్నలను పరిశీలిస్తున్న అధికారులు



## జొన్నలు క్వింటా రూ.3,180తో కొనుగోలు

దువ్వూరు (మైదుకూరు), ఫిబ్రవరి 3: రైతుల వద్ద నుంచి జొన్నలు క్వింటా రూ.3,180 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని జిల్లా సివిల్ సప్లయ్ మేనేజరు అర్జునరావు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయాధికారులతో కలసి ఆయన దువ్వూరు మండలంలోని ఇడమడక, కానగూడూరు తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లజొన్న సాగు చేసిన రైతులు తమ ఉత్పత్తులను అమ్మాలనుకుంటే అక్కడి రైతు భరోసా కేంద్రంలో పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని జొన్నలు అమ్మాలనుకునే రైతులు ఆర్బీకేలలో పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.

## పాత పెన్షన్ల కోసం మరో పోరుబాట

- ఓట్ ఫర్ ఓపీఎస్ పేరిట జనంలోకి
- మార్చి 30 వరకు వివిధ రూపాల్లో కార్యక్రమాలు
- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా



పోస్టరును ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3: పాత పెన్షన్ సాధన కోసం మరో పోరుబాటకు యూటీఎఫ్ సమాయత్తమైందని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేశ్‌బాబు తెలిపారు. శనివారం సాయంత్రం ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టరును యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ సాధన కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. సీఎం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయక నాలుగు సంవత్సరాల తరువాత జీపీఎస్ అనే మరో కొత్త దుర్మార్గపూరిత పెన్షన్ విధానం ప్రవేశపెట్టడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమే అన్నారు. ఈ నేపథ్యంలో ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో న్యాయమైన పాత పెన్షన్ కోసం తమ పోరాటాన్ని ప్రజల్లోకి కూడా తీసుకువెళతామన్నారు. 7 వ తేదీ వరకు అన్ని కార్యాలయాలు, పాఠశాలల్లో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లతో ప్రచారం చేస్తామన్నారు. 12 నుంచి 15వ తేదీ వరకు అన్ని రాజీకయ పార్టీల మండల స్థాయి నాయకులకు వినతులు ఇస్తామని, 18 నుంచి 21 వరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లకు, అభ్యర్థులకు వినతిపత్రాలు ఇస్తామని అన్నారు. 23న జీపీఎస్‌పై బుక్‌లెట్ విడుదల, 25 నుంచి 28 వరకు అన్ని పార్టీల జిల్లాస్థాయి నాయకత్వానికి వినతిపత్రాలు, మార్చి 5 నుంచి 10 వరకు అన్ని పాఠశాల్లో, ఆఫీసుల్లో స్టిక్కర్లు, బుక్‌లెట్ల పంపిణీ చేస్తామన్నారు. మార్చి 15 నుంచి 30 వరకు అసెంబ్లీ అభ్యర్థులతో బహిరంగ చర్చావేదిక నిర్వహిస్తామని, 26 నుంచి 30 వరకు అన్ని నియోజకవర్గాల్లో బైకు ర్యాలీలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రాణి, నరసింహారావు, ఓబుల్‌రెడ్డి, రూత్ ఆరోగ్యమేరీ, శ్రీనివాసులు, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## గుట్టపాళెం సరిహద్దులో ఏనుగుల సంచారం

కలికిరి, ఫిబ్రవరి 3: మండలంలోని గుట్టపాళెం పంచాయతీ సామగుంటవారిపల్లె, వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ పరిధిలోని చారాలవాండ్లపల్లె, ఎర్రగుంట్లబావి, మేకలవారిపల్లె గ్రామాల సరిహద్దులో ఏనుగుల సంచారాన్ని గుర్తించినట్లు వాల్మీకిపురం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు ఈ రెండు పంచాయతీలకు చెందిన అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రెండు గున్న ఏనుగులు ఎర్రగుంట్లపల్లె అటవీ ప్రాంతం నుంచి సామగుంటవారిపల్లె ప్రాంతం వైపు సంచరిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ అటవీ ప్రాంతం పరిసర గ్రామాల్లోని ప్రజలు ప్రధానంగా రైతులు ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని సూచించారు. గొర్రెలు, మేకల పెంపకందార్లు కూడా తగు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ఆయా గ్రామ పంచాయతీల ప్రజలను అప్రమత్తం చేయడంలో సహకరించాల్సిందిగా కూడా విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతం లోపలికి ఎవరూ వెళ్లకుండా సూచనలు జారీ చేయాలని కోరారు. కాగా వాల్మీకిపురం, కలికిరి మండల పరిసరాల్లో ఏనుగుల సంచారాన్ని గుర్తించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.




ఎర్రగుంట్లపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు

# కడప క్యాసినో..!

- జూలు విదిల్చిన జూదం
- అధికారిక అడ్డాగా సీఎం గడ్డ
- రోజూ చేతులు మారుతున్న కోట్లు
- సీమ జిల్లాల నుంచి జూదరుల రాక
- ఆటగాళ్ల కోసం ఏజెంట్ల నియామకం
- ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున కమీషన్
- ఆటసాగే చోట చుట్టూ బౌన్సర్లు
- మొబైల్ ఫోన్లకు అనుమతి నో
- సకల సౌకర్యాలు.. మందు, విందు
- అక్కడే వడ్డీ వ్యాపారం
- ఆటకు ఆటంకాలు లేకుండా ఫుల్ రక్షణ
- అంతా ఆ 'త్రీ స్టార్ సార్' కనుసన్నల్లోనే





కడప, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సొంత జిల్లా జూదానికి అడ్డాగా మారిందని అంటారు. ఇప్పటిదాకా జూదం కోసం గోవా, బెంగళూరు, చెన్నై, శ్రీలం క, నేపాల్, కాంబోడియా, కజకిస్థాన్ దేశాలలో క్యాసి నో ఆడేవారు. అక్కడ జరిగే ఈవెంట్లకు ఉమ్మడి కడపజిల్లా నుంచి పెద్దఎత్తున జూదరులు వెళ్లేవారని చె బుతారు. అంత దూరం వెళ్లడం ఎందుకంటూ కడపకే క్యాసినో తెచ్చేశారంటారు. తులసి వనంలో గంజాయి మొక్కలా మారిన ఓ పోలీసు 'సార్' కనుసన్నల్లో కడ ప క్యాసినో జరుగుతోందంటూ ప్రచారం ఉంది. కొన్నేళ్లుగా ఇక్కడే తిష్ట వేసిన ఆయన ఆగడాలకు అదుపులేకుండా పోతోందంటారు. ప్రస్తుతం ఆయన ఎఫ్ఐఆర్ కట్టే పరిస్థితి కూడా లేదు. లూప్‌లైన్‌లో పనిచేస్తున్నారు. అయితే అంతా తానై నడిపిస్తారంటారు. పోనీ అయనదేమైనా పెద్ద పోస్టు అనుకుందామా అంటే అది కూడా కాదు. ఆయన కేవలం త్రీస్టార్ అధికారి మాత్రమే.. పెత్తనం మాత్రం పోలీస్ బాస్‌లా ఉంటుం దంటారు. పోలీసు వర్గాల్లో ఆయన గురించి పుంఖా నుపుంఖాలుగా చెబుతారు. ఇపుడు ఆయన కనుసన్నల్లోనే క్యాసినో జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

### జూలు విదిలిస్తున్న జూదం

ఒకప్పుడు ఎవ్వరికీ కనిపించకుండా ఉండేలా కంప చెట్లు, కుంటలు, పొలాల్లో జూదం ఆడేవారు. ఆటకు అలవాటైన ఖరీదైన వాళ్లు బెంగళూరు, చెన్నై వెళ్లి ఆడేవారు. అయితే బెంగళూరులో కూడా మూడు నాలుగేళ్లుగా జూదంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. దీంతో గోవాతో పాటు శ్రీలంక, కాంబోడియా, నేపాల్, కజకిస్థాన్ దేశాల్లో ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. ఏజెంట్లు జూదగాళ్లను కాంటాక్ట్ అయి ప్యాకేజీ ప్రకారం అక్కడకు తీసుకెళ్తారు. ఈవెంట్ మూడు రోజుల నుంచి నాలుగు రోజుల వరకు ఉంటుంది. అంతదూరం వెళ్లి అక్కడ ఆడేవారు. అంతదూరం వెళ్లడం ఎందుకు.. ఇక్కడే ఆడుకోండి అన్ని వసతులు కల్పిస్తామని నిర్వాహకులు చెప్పారేమో.. జిల్లాలో కొన్ని నెలలుగా భారీగా జూదం నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం మైదుకూరు, కడప, కమలాపురం ప్రాంతాల్లో జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాతో పాటు కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ఆటగాళ్లు వస్తున్నట్లు చెబుతున్నారు.

### ప్రత్యేక ఏజెంట్ల నియామకం

నిర్వాహకులు ప్రముఖులతో ఒప్పందం కుదుర్చుకొని ఆట జరిగే ప్రాంతాలలో ఆటగాళ్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెబుతారు. పోలీసుల దాడులు ఇతరత్రా ఘటనలు జరిగితే ఆటగాళ్లు రారు అంటారు. అందుకే ఎలాంటి ఇబ్బంది లేకుండా గేమ్ నిర్వహిస్తున్నట్లు చెబుతారు. గేమ్‌ను ఒకేచోట కాకుండా రోజుకొక ప్రాంతంలో ఆడిస్తున్నట్లు చెబుతున్నారు. దూరం నుంచి వచ్చే జూదగాళ్లకు ముందే సమాచారం ఇస్తారంటారు. ఆటగాళ్లకు సెల్‌ఫోన్ అనుమతి లేదు. ఆ ప్రాంతమంతా బౌన్సర్లతో పూర్తి రక్షణ ఏర్పాటు చేసుకుంటారని అంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఆటగాళ్లకు వెహికల్ బాడుగను కూడా నిర్వాహకులే చెల్లిస్తారంటారు. వారికి వెజ్ నాన్‌వెజ్ ఫుడ్‌ను పెడతారు. ఇక డబ్బులు పోగొట్టుకుంటే స్పాట్ ఫైనాన్స్ కల్పిస్తారు. లక్షకు రెండు వేల నుంచి ఐదువేలు తీసుకుటున్నట్లు సమాచారం. ఇక ఆటగాళ్లను తీసుకొచ్చిన ఏజెంట్లకు ఒక్కొక్కరికి రూ.1000 కమీషన్ ఇస్తారని సమాచారం. ఇక మైదుకూరు నియోజకవర్గంలో అయితే ఆయా మండలాల్లో, కమలాపురం ప్రాంతంలో ఓ ఫ్యాక్టరీ వద్ద జూదం జరుగుతున్నట్లు సమాచారం. కడపలో రోజుకొక ప్రాంతం మారుస్తున్నట్లు తెలిసింది.

### చేతులు మారుతున్న కోట్లు

జూదం జరిగే చోట ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడడంతో ఆటగాళ్లు ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వస్తున్నట్లు చెబుతున్నారు. ఒక్కోచోట కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం. గోవాలో అయితే మినిమమ్ ఆట రూ.1000 పెడితే ఇక్కడ రూ.10వేలు పందెం కాస్తారంటారు. ఒక్కోచోటనే రెండు నుంచి ఐదుకోట్ల రూపాయల మధ్య ఆటసాగుతుందని తెలుస్తోంది. గోవా, శ్రీలంక ఇతరదేశాలకు వెళ్లి ఆడాలంటే అక్కడ ఈవెంట్లలో గెలుస్తున్నప్పటికి టూర్ అయిపోయేంత వరకు డబ్బులు ఇవ్వరంటారు. అక్కడ నాలుగైదు రోజులు ఉండాలి. అదే ఇక్కడ అయితే.. ఉదయం వచ్చి సాయంత్రం వెళ్లచ్చు అంటున్నారు. దీనికి తగ్గట్లు ఆటపై ఎలాంటి ఈగలు వాలకుండా నిర్వాహకులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు గాను ఈగ వాలకుండా చూస్తున్న ఆ త్రీస్టార్ 'సార్'కు రోజుకు లకారాలు ఇస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆ సారు అనుచరులే ఆటలో కొందరు ఫైనాన్సింగ్ చేసి బాగా వెనకేసుకున్నారు అని చెబుతారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీకి ఆదేశాలిచ్చారు. దీంతో బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగుతో పాటు పలుచోట్ల డబ్బు పట్టుబడింది. అయితే మైదుకూరులో జూదమాడేందుకు వస్తున్న కొందరి డబ్బు కూడా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డట్లు చెబుతారు. అది మినహాయిస్తే ఆడేచోట మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండడంతో జూదరులు కడపకు క్యూకడుతున్నట్లు చెబుతున్నారు. సీఎం సొంత జిల్లానే జూదరులకు అడ్డాగా మారడం విమర్శలకు తావిస్తోంది.

## విద్యాసాగర్ హాస్పిటల్‌లో రోబోటిక్ సేవలు

- రోబోటిక్ టెక్నాలజీతో కచ్చితత్వంగా శస్త్ర చికిత్సలు
- విద్యాసాగర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి




కడప (మారుతీనగర్), ఫిబ్రవరి3: కడపలోని తమ హాస్పిటల్‌లో ప్రప్రథమంగా అత్యాధునిక ప్రపంచస్థాయి రోబోటిక్ టెక్నాలజీ ద్వారా కచ్చితత్వంగా మోకాలు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు విద్యాసాగర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ సి.విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం కడప నగరం, రాజీవ్‌మార్గ్ సోనోవిజన్ దగ్గర గల విద్యాసాగర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో రోబోటిక్ టెక్నాలజీని మోకాలు, తుంటి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల విభాగాన్ని ప్రారంభించారు. అమెరికా వారి స్మిత్ & నెఫ్యూ కంపెనీకి చెందిన కోరి రోబోటిక్ సిస్టంని కొన్ని రోజులుగా ఉపయోగించి సత్ఫలితాలను రాబట్టారు. శనివారం హాస్పిటల్‌కు వచ్చిన వారందరికీ రోబో పరికరాన్ని చూపించి దాని పనితీరును వివరించారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా మోకీలు శస్త్ర చికిత్స చేయించుకున్న పేషెంట్స్ తమ సంతృప్తిని, సంతోషాన్ని వచ్చిన వారందరితో పంచుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ కోరి రోబోటిక్ ద్వారా మోకీలు మార్పిడి (టోటల్ రీప్లేస్‌మెంట్), తుంటి, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స (టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్), రివిషన్‌ని రీప్లేస్‌మెంట్‌లు, సి.టి. రేడియేషన్ అవసరం లేకుండా రియల్ ఇంటలిజెన్స్ హ్యాండ్ హోల్డ్ రోబోటిక్ ఆర్మ్ ఉపయోగించి శస్త్ర చికిత్సలు చేయగలమని వివరించారు. మూడు నాలుగు సంవత్సరాలు దేశ, విదేశాలలో రోబోటిక్ టెక్నాలజీపై గడించిన విశేష అనుభవం, రోబోటిక్ టెక్నాలజీని డిజైన్ చేసిన బృందంతో చర్చల తర్వాత తమ హాస్పిటల్‌కు తీసుకువచ్చామన్నారు. రోబోటిక్ టెక్నాలజీతో తక్కువ కోత తక్కువ బోన్‌లాస్, తక్కువ టిష్యూలాస్‌తో సక్రమమైన ఇంప్లాంట్ అమరికతో మోకాలుకు అధిక స్థిరత్వాన్ని చేకూర్చవచ్చన్నారు. దీని ద్వారా నూరు శాతం కచ్చితత్వం, త్వరితగతిన రికవరీ, తక్కువ నొప్పి దీర్ఘకాలిక మన్నిక, సాధారణ మోకాలు అనే భావన, సునాయసమైన మోకాలు కదలికలు, సంతృప్తికరమైన సత్ఫలితాలు ఉంటాయని వివరించారు. 15 సంవత్సరాలుగా తమ హాస్పిటల్‌లో నిష్ణాతులైన వైద్యబృందం ద్వారా సుమారు 5,800 కిపైగా మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు చేశామన్నారు. ఇంపోర్టెడ్ మోకీలు పరికరాలు, లామినార్ ఎయిర్ ఫ్లోథియేటర్స్, అత్యాధునిక సదుపాయాలతో 50 పడకలు ఆసుపత్రిలో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఎన్.శ్రీలక్ష్మి, సురేశ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, చిత్రంలో డాక్టర్ శ్రీలక్ష్మి, ఎన్.సురేశ్‌కుమార్‌రెడ్డి

## 6న చలో అసెంబ్లీ ముట్టడి

- పార్టీల కతీతంగా సర్పంచ్‌లంతా తరలిరండి
- సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుత్తా యల్లారెడ్డి



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న పుత్తా యల్లారెడ్డి

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 3: గామాలలో కనీసం వీధిలైట్లు కూడా వేయలేని దుస్థితిలో నిధులు విధులు లేక వలంటీర్లకన్నా కూడా అధ్వాన్నంగా సర్పంచ్‌లు ఉన్నారని, ఇందుకు నిరసనగా జగన్‌రెడ్డి ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు ఈనెల 6వ తేదీ మంగళవారం చలో అసెంబ్లీ ముట్టడి చేపడుతున్నామని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుత్తా యల్లారెడ్డి తెలిపారు. గ్రామ స్వరాజ్యం అనే పదానికి అర్థం లేకుండా ప్రస్తుత వైసీపీ జగన్‌రెడ్డి పాలన సాగుతోందన్నా రు. ఆ మేరకు శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలన రాగానే పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసి సర్పంచ్‌లకు నిధులు, విధులు ఇవ్వకుండా నాశనం చేశారని ఆరోపించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను కూడా లాక్కోవడం దారుణమన్నారు. ఇంకా రెండున్నర సంవత్సరాల కాలవ్యవధి ఉన్నప్పటికీ తమను గెలిపించిన ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నామని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వం తమ విధులను...నిధులను అందకుండా చేసిన దృష్ట్యా, తిరిగి వీటిని సాధించుకునేందుకు... వచ్చే కొత్త ప్రభుత్వం కూడా ఇదే తరహాలో వ్యవహరించకుండా ఉండేలా చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. ఈ ముట్టడిని దిగ్విజయం చేసేందుకు పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు కదలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీ పంచాయతీరాజ్ చాంబర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. మునిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణతో పాటు సర్పంచ్‌లు ఎస్.గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 1.3కిలోల బంగారు బిస్కెట్లు స్వాధీనం

రాజంపేట, ఫిబ్రవరి 3: కారులో అక్రమంగా తరలిస్తున్న 1.338 కేజీల బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట అర్బన్ సీఐ మద్దయ్య ఆచారి శనివారం విలేకరులకు తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా తిరుపతి నుంచి వస్తున్న కారులో సీటు కింద బంగారు బిస్కెట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. కారు యజమాని కస్కేర్ మహ్మద్ జిలానీబాష, డ్రైవర్ షేక్ అజ్మత్‌ల వద్ద ఎలాంటి బిల్లులు లేకపోవడంతో రాయచోటిలోని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌కు తదుపరి చర్యల నిమిత్తం పంపించామన్నారు.

# ప్రొద్దుటూరు వైసీపీలో ముసలం..!

- వైసీపీని వీడనున్న మున్సిపల్ కౌన్సిలర్లు
- ఇప్పటికే ఎనిమిది మంది అజ్ఞాతంలోకి
- కౌన్సిలర్ల కుటుంబాలపై అధికారపార్టీ నేతల ఒత్తిళ్లు
- వైసీపీలో పెరుగుతున్న తిరుగుబాటుదారులు
- అధికారమంతా ఎమ్మెల్యే, ఆయన బావమరిదిదే
- నోటిఫికేషన్ నాటికి వైసీపీని వీడనున్న మరికొందరు




ప్రొద్దుటూరు వైసీపీలో ముసలం మొదలైంది. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై రోజురోజుకు అసమ్మతి పెరిగిపోతోంది. ఇప్పటికే నలుగురు మున్సిపల్ కౌన్సిలర్లు బహిరంగంగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా తిరుగుబాటు జెండా ఎగరేసి జట్టుగా నడుస్తున్నారు. ఆయనతో చాలా నష్టపోయామని ఆయనకు టిక్కెట్టు ఇవ్వరాదంటూ తమ అసమ్మతిని ప్రకటిస్తున్నారు. కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి నేతృత్వంలో వీరంతా ప్రత్యేకంగా పార్టీ కార్యక్రమాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే నియంతృత్వ ధోరణులతో విసిగిపోయామంటున్నారు. ఎమ్మెల్యే. ఆయన బావమరిది బంగారురెడ్డితో మిగిలిన కౌన్సిలర్లు పైకి సఖ్యతగా కనిపిస్తున్నా.. అంతర్గతంగా ఇమడలేని పరిస్థితి ఉందని ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 2: కొద్దికాలంగా రాచమల్లు కోటకు బీటలు వారుతూ వస్తోంది. రాచమల్లు కోటను ఫిరంగులతో దాడిచేసినా బీటలు వారదని వైసీపీది ఉక్కుకోటని ఆయన చెప్పిన మాటలు నేడు నిజం కాదని తేలిపోతోంది. కొంతకాలంగా అసంతృప్తితో రగిలిపోతున్న కొందరు వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. దాదాపు ఎనిమిది మంది వరకు పార్టీ మారేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే వారు ప్రొద్దుటూరులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీని వీడుతున్న సమాచారంతో అధికార పార్టీ ముఖ్యనేతలు కౌన్సిలర్ల కుటుంబాలపై ఒత్తిడి పెంచుతున్నారు. మీకు ఎన్నికల్లో పెట్టిన డబ్బులు మాకు కట్టి వెళ్లాలంటూ అధికారపార్టీ బెదిరింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం.

### తీవ్రమైన అసంతృప్తితో..

వైసీపీలో కొంతకాలంగా 8మంది కౌన్సిలర్లు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఒక కౌన్సిలర్ భర్త ఎమ్మెల్యే రాచమల్లు రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఆయనకు నమ్మిన బంటులా ఉన్నాడు. ఏకంగా తన ఇంటిని కూడా అమ్మి ఆయనవెంటే రాజకీయాల్లో తిరిగేవాడని చెబుతారు. అలాంటి ముఖ్య అనుచరుడైన వ్యక్తి తన భార్యను కౌన్సిలర్‌గా పోటీకి పెడితే 2014లో ఓటమి చెందారు. 2020లో మాత్రం గెలుపొందారు. కౌన్సిలర్‌గా 11వ వార్డు నుంచి గెలిచిన రమేశ్ యాదవ్ వైపీపీకి చైర్మన్ అభ్యర్థి. అనూహ్య పరిణామాల నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థి మార్పు జరిగింది. ఇక్కడ ఎమ్మెల్యే, ఆయన బావమరిదికి మున్సిపాలిటీలో ఆధిపత్యం ఉండాలంటే వారికి తలూపే వారు కేవలం కుర్చీకి పరిమితం అయ్యేవారు ఉండాలి. అందుకే రమేశ్ యాదవ్‌ను తప్పించి మరో మహిళా కౌన్సిలర్‌కు చైర్‌పర్సన్ పదవి అప్పగించారు. అయితే రాచమల్లు రాజకీయం మొదలెట్టినప్పటి నుంచి ఆయనకు నమ్మిన బంటులా ఉన్న వ్యక్తి భార్యకు కాకుండా వేరే ఆమెకు చైర్‌పర్సన్ పదవి ఇవ్వడంతో ఆయనలో అసంతృప్తి ప్రారంభం అయింది. దీనికి తోడు తన వార్డులో అంగన్‌వాడీ పోస్టులను కూడా ఇప్పించుకోలేకపోయాడని అంటారు. ఆ వార్డులో మూడు అంగన్‌వాడీ పోస్టులను 'పెద్ద' నాయకుడు రూ.8లక్షల చొప్పున అమ్ముకున్నాడనే ఆరోపణలున్నాయి. చివరకు ఆయన తన పిల్లలకు వలంటీర్ కొలువులు మాత్రమే ఇప్పించుకోగలిగాడు. ఇది ఆయనలో మరింత అసంతృప్తి పెంచిందని అంటారు.

మరో కౌన్సిలర్ కుమారుడికి దశాబ్దాలుగా ఉన్న ఒక ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్ట్‌ను ఎమ్మెల్యే ఆయన బావమరిదే తొలగించటంతో అతను వీరికి దూరమయ్యారు. అతను నేరుగా సోషల్ మీడియాలో ఎమ్మెల్యే, ఆయన బావమరిదిపై విమర్శలు చేశారు. మరో యువ కౌన్సిలర్‌కు కూడా కనీసం తన వార్డులో తగినన్ని వర్కులు పెట్టకపోవడం, ఎక్కడా అతనికి ప్రాధాన్యత లేకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు. తన వార్డులో అంగన్‌వాడీ పోస్టు తనకు కావాల్సిన వారికి వేసుకుందామని భావిస్తే అదికూడా దక్కకుండా 'పెద్ద'నాయకుడే పోస్టు అమ్ముకున్నట్లు ఆరోపణలున్నాయి. మరో కౌన్సిలర్ భర్త కూడా అసంతృప్తితో వీరి కూటమిలో ఉన్నారు. మరో కౌన్సిలర్ భర్తకు సంబంధించి స్థలం వివాదంలో ఉంది. దీనిని సెటిల్ చేస్తానని అతని వద్ద 'పెద్ద' నాయకుడు రూ.25 లక్షలు డబ్బులు తీసుకుని రెండేళ్లకు పైగా ఏమీచేయకుండా అన్యాయం చేశారని ఆరోపణలున్నాయి. అంతేకాకుండా తన వార్డులో కాలువ అన్యాక్రాంతం అయినా స్వయంగా కౌన్సిల్లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని సమాచారం. మరో మైనారిటీ కౌన్సిలర్ అసంతృప్తివాదులతో చేతులు కలిపాడని అనుమానించారు. దీంతో హౌసింగ్ ఇళ్లనిర్మాణాలకు సంబంధించి డబ్బులు వాడుకున్నాడనే నెపం మోపి మున్సిపల్ ఆఫీసులోనే పంచాయితీ పెట్టి అతన్ని అవమానించారు. దీంతో ఆ కౌన్సిలర్ నేడు అసమ్మతి వర్గంలో ఉన్నారు. వీరంతా కలిసి వైసీపీని వీడేందుకు రంగం సిద్ధమైంది. నేడో రేపో పార్టీ మారే అవకాశాలున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వీరంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇది తెలిసి వీరి కుటుంబాలను అధికార పార్టీ నేతలు బెదిరిస్తున్నారని అంటున్నారు.

### నోటిఫికేషన్ నాటికి మరికొందరు

ప్రస్తుతానికి వైసీపీకి చెందిన 8మంది కౌన్సిలర్లు పార్టీ వీడేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికి మరికొంత మంది వైసీపీ ముఖ్యనేతలు, కౌన్సిలర్లు వైసీపీని వీడే అవకాశం ఉందని ప్రొద్దుటూరులోని రాజకీయ వర్గాల్లో చర్చనడుస్తోంది. ఇదే జరిగితే ఎమ్మెల్యే రాచమల్లు ఉక్కుకోట బీటలు వారడం తథ్యమని అంటున్నారు.

## దుకాణ సంస్థల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**కార్మిక శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్**



దుకాణాల సంఘ సభ్యులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌నాయక్

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 3: జిల్లాలోని దుకాణాల సంస్థలను ఏర్పాటు చేసే వారు దుకాణాల సంస్థల చట్టం 1988 ప్రకారం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. శనివారం ఆయన పాత రిమ్స్‌లో గల కార్మిక శాఖ కార్యాలయంలో వివిధ వర్తక యాజమాన్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాల సంస్థలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇందుకోసం కార్మిక శాఖ కార్యాలయంలో నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈనెల 29లోపు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కిరాణా మర్చంట్, ఫార్మా మెడికల్ సంబంధించిన యాజమాన్య సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

## భూమిలోకి కుంగిన బోరు



భూమిలోకి కుంగిపోయిన బోరు

సంబేపల్లె, ఫిబ్రవరి 3: ప్రజల తాగునీటి వసతి కోసం వేసిన తాగునీటి బోరు అది. ఉన్నట్టుండి ఎనిమిది అడుగుల లోతుకు కుంగిపోయింది. దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లెలో శనివారం ఈ ఘటన జరిగింది. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఏడాదిన్నర క్రితం జలజీవన్ మిషన్ కింద బోరు వేసి, మోటారు బిగించారు. శనివారం ఉన్నట్టుండి ఆ ప్రాంతంలో భూమి కుంగిపోవడంతో బోరు ఎల్‌బెండ్ సాయంతో నిలబడినట్టు స్థానికులు తెలిపారు. ఎల్‌బెండ్ లేకుంటే మరింత లోతుకు వెళ్లిపోయేదని తెలియజేశారు.

నియోజకవర్గంలో బండలు, గుట్టలు, రాళ్లు ఉండడంతో భూమి గట్టిగా ఉంటుంది. కుంగిపోవడానికి ఆస్కారం ఉండదు. బోరు వేసే సమయంలో గట్టి నేల తగిలే వరకు కేసింగ్ పైపు వేస్తారు. కాగా ఉమ్మడి కడప జిల్లాలో సీకే దిన్నె మండలంలో గతంలో వర్షాకాలంలో భూమి కుంగినట్లు తెలిసిందే. బోరు భూమి లోపలికి పోవడంతో గొయ్యి ఏర్పడిందని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బోరు వేసే సమయంలో సంబంధిత కాంట్రాక్టర్ కేసింగ్‌ను భూమి గట్టిగా ఉన్నంతవరకు వేయకపోవడం కూడా కారణమై ఉండవచ్చునని స్థానిక ప్రజలు తెలిపారు. బోరు కుంగిపోవడానికి కారణాన్ని అధికారులు పరిశీలించాల్సి ఉంది.

## వైవీయూ ఇంజనీరింగ్ కళాశాల ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3 : వైవీయూ పరిధిలోని ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ మొదటి సెమిస్టరు ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ విడుదల చేశారు. 81.66 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. సివిల్, సీఎస్ఈ, ట్రిబుల్ఈ, ఈసీఈ, ఎంఈ, ఎంఎంటీ బ్రాంచ్‌లలో 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 196 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. సివిల్‌లో 85.71 శాతం, కంప్యూటరు సైన్స్‌లో 91.90 శాతం ట్రిబుల్ఈలో 74.41 శాతం, ఈసీఈలో 65.21, ఎంఈలో 78.78 శాతం, ఎంఎంటీలో వంద శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఈ సందర్భంగా పరీక్షల విభాగాన్ని అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రారు ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల డీన్ ప్రొఫెసరు రమణయ్య పాల్గొన్నారు.

## పుష్పగిరి హుండీ ఆదాయం లెక్కింపు

వల్లూరు, ఫిబ్రవరి 3 : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరి కొండపై వెలసిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో దేవదాయ శాఖ అధికారులు, భక్తుల సమక్షంలో ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను లెక్కించారు. ఇందులో రూ.3,21,795 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, అర్చకులు అఖిల్‌దీక్షితులు, సుమంత్ దీక్షితులు, పురావస్తుశాఖ, దేవదాయశాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## కలిచెర్లవాసి దుబాయ్‌లో గుండెపోటుతో మృతి



షబ్బీర్ వలీ (ఫైల్)

పెద్దమండ్యం, ఫిబ్రవరి 3: పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన షబ్బీర్‌వలీ (38) దుబాయిలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు శనివారం తెలిపారు. షబ్బీర్‌వలీకి భార్య, ఆరుగురు పిల్లలు ఉన్నారు. ఇతను కుటుంబ పోషణకు రెండు నెలల క్రితం దుబాయికి వెళ్లాడు. అక్కడ ఈనెల 2వతేదీ శుక్రవారం నమాజ్‌కు వెళ్లి తిరిగి రూమ్‌కు వెళ్లిన అనంతరం గుండెపోటు వచ్చి గంట వ్యవధిలోనే కుప్పకూలిపోయి మృత్యువాత పడినట్లు సమాచారం వచ్చిందని కుటుంబసభ్యులు తెలి పారు. బాధిత కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. ప్రభుత్వం చర్యలు తీసుకొని నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## పలు విభాగాలను తనిఖీ చేసిన వైవీయూ వీసీ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3 : వైవీయూలో శనివారం వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నియంత్రణ అధికారి పర్యవేక్షణలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం సైన్స్ బ్లాక్‌లోల బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ ఎన్విరాన్‌మెంట్‌ల సైన్స్ విభాగ తరగతులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఇంజనీరింగ్ విభాగం పరిశీలించి రికార్డులు చూసి అధికారులకు పలు సూచనలు అందించారు.

## గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గుండ్లకుంట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభావతి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం గుండ్లకుంట పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్ ఇంగ్లీషుమీడియంలో బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. అర్హతగల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ అభ్యర్థులు 25.1.2024 నుంచి 23.2.2024 వరకు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇతరు వివరాలకు 9704550130 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.

## రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కడప (క్రైం), ఫిబ్రవరి 3 : ఒంటిమిట్ట-భాకరాపేట రైల్వేస్టేషన్ల మధ్య ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... తమిళనాడు రాష్ట్రం రామానంతపురం జిల్లా ఇమనేశ్వరంలోని సిలోన్ కాలనీకి చెందిన బాలాజీ కుజిల్లా (25) ఒంటిమిట్ట సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. అతడి శరీరం రెండు ముక్కలైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

**రైల్లో నుంచి జారి పడి వ్యక్తి మృతి :** కడప రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. రాజస్థాన్ రాష్ట్రం లోడా గ్రామానికి చెందిన సురేశ్‌కుమార్ (42)గా గుర్తించినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు.

## 11 మంది కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

గుర్రంకొండ, ఫిబ్రవరి 3: కోడిపందేలపై పోలీసులు దాడులు నిర్వహించి 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లి సమీపంలో కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి 11 మందిని అరెస్టు చేసి, రూ.7550 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

# 'బొల్లవరం'.. అభివృద్ధికి సుదూరం

అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందాన ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిస్థితి ఉంది. కోట్ల రూపాయల ఆస్తులున్నా వాటిని సంరక్షించి ఆదాయాన్ని పెంచుకునే దిశగా చర్యలు లేవు. ఆఖరికి కోట్ల రూపాయల ఆదాయం వచ్చిన బొల్లవరం మున్సిపల్ లేవుట్‌లో కనీస వసతులైన రోడ్లు, విద్యుత్, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయలేదు. దీంతో వందల కోట్ల విలువ చేసే స్థలాలు ఇక్కడ నిరుపయోగంగా ఉన్నాయి.

ప్లాట్లలో ఏపుగా పెరిగిన జంబు పిచ్చిమొక్కలు



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 3: ప్రొద్దుటూరులో హుడ్కో రుణంతో జమ్మలమడుగు మెయిన్ రోడ్డును ఆనుకుని బొల్లవరం రెవెన్యూ పొలంలో దాదాపు 85.15 ఎకరాల భూములను మున్సిపాలిటీ కొనుగోలు చేసింది. ఆ భూములను మొత్తం 761 ప్లాట్లుగా విభజించారు. ఇందులో ఓపెన్‌స్పేస్ కింద పది శాతం 8.50 ఎకరాల భూములను పార్కులు, సామాజిక అవసరాల కోసం వదిలారు. 24.74 ఎకరాలను విశాలమైన రోడ్ల నిర్మాణం కోసం వదిలారు. ఇందులో హెచ్ఐజీ ప్లాట్లు 95, ఎంఐజీ ప్లాట్లు 147 ఏర్పాటు చేశారు. వీటిని సెంట్ల వారీగా 7.5 సెంట్లు, 5.5 సెంట్లు, 2.5 సెంట్లు ప్లాట్లుగా విభజించి బహిరంగ వేలం వేసి విక్రయించారు. 2007-2008 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన వేలం పాటల్లో సెంటు రూ.70 వేల నుంచి రూ.2లక్షల విలువతో విక్రయించారు. మొత్తం 761 ప్లాట్లలో 243 ప్లాట్లను విక్రయించారు. ఇంకా 518 ప్లాట్లు ఉన్నాయి. విక్రయించిన ప్లాట్లకు నాడు రూ.14 కోట్ల మేర మున్సిపాలిటీకి ఆదాయం సమకూరింది.

### రూ.5 కోట్లతో పనులు

బొల్లవరం మున్సిపల్ లేఅవుట్‌లో ప్లాట్ల విక్రయం ద్వారా వచ్చిన ఆదాయంతో అక్కడ రూ.5కోట్లతో మెటల్ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైప్‌లైను పనులు చేపట్టారు. లేఅవుట్‌లో ప్రత్యేకంగా ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం మొదలుపెట్టారు. ఏమైందో ఏమోకానీ ఈ పనులు అసంపూర్తిగా వదిలేశారు. మున్సిపాలిటీ మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్లాట్లు కొన్నవారు ఇక్కడ నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో ఇక్కడ విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయి. పైపులైను నిర్వహణలేక లీకులతో నీళ్లన్నీ ప్లాట్లలో చేరి జంబు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. మౌలిక వసతులు కల్పించాలంటూ అక్కడ స్థలాలు కొనుగోలు చేసిన వారు అనేకమార్లు వినతులు అందజేసినా అధికారులు కానీ పాలక మండలి కానీ పట్టించుకోలేదు.

### తొలగిన హద్దురాళ్లు

మున్సిపల్ లేఅవుట్‌లో 16ఏళ్లక్రితం వేసిన ప్లాట్లరాళ్లు తొలగిపోయి హద్దులు చెరిగిపోయాయి. అంతేకాకుండా ఓ రాజకీయ పార్టీ సమావేశం ఆ ప్లాట్లలో ఏర్పాటు చేయడం వల్ల కూడా కొంత భాగం రాళ్లు తొలగిపోయాయి. అంతేకాకుండా అక్కడ ఖాళీ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తుల భవన నిర్మాణ వ్యర్థాలు పెద్దఎత్తున వేశారు.

**ప్లాట్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం..**

బొల్లవరం మున్సిపల్ లేఅవుట్ స్థలాలు నేడు మార్కెట్‌లో భారీగా విలువ చేస్తాయి. ఈ లేఅవుట్ భూములన్నీ ఏడాది క్రితమే నిషేధిత జాబితా నుంచి తొలగిపోయాయి. కౌన్సిల్లో లేఅవుట్ అభివృద్ధి పనులకు ఆమోదం తీసుకుని రోడ్లు, విద్యుత్, తాగునీటి వసతి, గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు చేపడతాం..

**- వెంకటరమణయ్య, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు**

### నిషేధిత జాబితాలో పెట్టిన కారణంగా..

మున్సిపాలిటీ కొనుగోలు చేసిన 85.15 ఎకరాల భూముల్లో 70.09 ఎకరాలు పట్టా ల్యాండ్ ఉంది. అందులో 52.46 ఎకరాలు 22 ఏ కింద ఉండటంతో ఆ భూముల్లో విక్రయాలు ఆగిపోయాయి. దీంతో గత ఏడాది మున్సిపల్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు రిపోర్టు పంపడంతో వాటిని 22 ఏ జాబితా నుంచి తొలగించారు. ఇంకా ఇందులో 4.90ఎకరాలు చుక్కల భూమి, 9.10 ఎకరాల ఇనాం భూమి, ఒక ఎకరా రస్తా పోరంబోకు ఉంది. రస్తా పోరంబోకు తప్ప అన్ని భూములు ఎలిమినేట్ అయ్యాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో కొన్నేళ్లుగా బొల్లవరం లేఅవుట్‌లో స్థలాలకు భారీగా రేట్లు వచ్చాయి. అప్పట్లో సెంటు రూ.70 వేల నుంచి రెండు లక్షల వరకు పోతే నేడు సెంటు పది లక్షలు పలుకుతోంది.

- ప్లాట్ల విక్రయాల్లో రూ.14 కోట్ల ఆదాయం
- లే అవుట్‌లలో మట్టిరోడ్లు కూడా ఏర్పాటు కాని వైనం
- కనీసం నెంబరు రాళ్లు కానరాని దుస్థితి
- స్థలాల్లో పెరిగిన జంబు, కంపచెట్లు
- ఆదాయం తప్ప... అభివృద్ధి పట్టని అధికారులు
- ఇదీ బొల్లవరం మున్సిపల్ లేఅవుట్ దుస్థితి



అసంపూర్తిగా నిలిపోయిన వాటర్‌ట్యాంక్

ఈ మున్సిపల్ లేఅవుట్ చుట్టూ పెద్దఎత్తున కాలనీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఆ ప్లాట్లు అభివృద్ధి చేసి బహిరంగ వేలం పెడితే మున్సిపాలిటీకి వందల కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. పెద్ద లేవుట్ అభివృద్ధి చేయడం ద్వారా పన్నులు రూపేణా ఆదాయం సమకూరుతుంది. ఆ దిశగా మున్సిపాలిటీ వారు చర్యలు తీసుకోవాలని ఇక్కడ ప్లాట్లు కొన్నవారు కోరుతున్నారు.



మున్సిపల్ లేఅవుట్ ముఖద్వారం



ప్లాట్ల స్థలాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు



లేఅవుట్‌లోని పార్కు దుస్థితి

## వేర్వేరుచోట్ల 72 గోవా మద్యం బాటిళ్లు పట్టివేత





కడపలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు - రాజంపేటలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3 : వాస్కోడిగామా నుంచి తిరుపతి వెళుతున్న రైలు నెం.17420లో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని కడప రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. శనివారం కడప రైల్వేస్టేషన్‌లో మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు రైల్వే సీఐ నాగార్జున తెలిపారు. గుంతకల్లు రైల్వే డీఎస్పీ షేక్‌షా ఆదేశాల మేరకు కడప ప్రయాణికుల వస్తువులను సోదా చేశామన్నారు. వాస్కోడిగామా నుంచి తిరుపతికి వెళుతున్న రైలు నుంచి ఓ వ్యక్తి కడప రైల్వేస్టేషన్‌లో దిగారన్నారు. అతడి బ్యాగును సోదా చేయగా 10 మద్యం బాటిళ్లు ఉన్నట్లు తెలిపారు.

ఆ బాటిళ్లను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. దాడుల్లో ఆర్ఎస్ఐలు విజయనరసింహ, రవిచంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వారిని సీఐ అభినందించారు.

### గోవా మద్యం స్వాధీనం, ఒకరి అరెస్టు

రాజంపేట, ఫిబ్రవరి 3: రాజంపేట మండలంలోని ఊటుకూరు పంచాయతీలో శనివారం దాడులు నిర్వహించి 72 గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సంధ్య తెలిపారు. మద్యం బాటిళ్లు కలిగి ఉన్న వెంకటరాజంపేట గ్రామానికి చెందిన కట్టా నారాయణను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మద్యం ఎవరు సరఫరా చేశారు అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్ కానిస్టేబుల్ పృథ్వీ, సిబ్బంది రమణ, చిదంబరయ్య, రంగయ్య, ప్రమీల పాల్గొన్నారు.

## మాకు పునరావాసం కల్పించరా...!

- ఏపీఎండీసీ ఎండీని నిలదీసిన ప్రజలు



ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డిని నిలదీస్తున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లి, ఫిబ్రవరి 3: ఏపీఎండీసీ సంస్థ అభివృద్ధికి సహకరించిన అగ్రహారం గ్రామ తరలింపులో అన్యాయం చేస్తున్నారని ఎండీ వెంకటరెడ్డిని గ్రామస్థులు నిలదీశారు. శనివారం ఏపీఎండీసీ ప్రాంగణంలోని రామాలయం లో ఎండీ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన అగ్రహారం గ్రామస్థులు ఆయనతో మాట్లాడుతూ ఏపీఎండీసీ సంస్థ కోసం తమ భూములను, ఇళ్లను విడిచి పెట్టినందుకు తగిన శాస్తి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శాశ్వత పరిష్కారం చూపకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థ అభివృద్ధి కోసం ఇప్పటికే మూడుసార్లు మారామని తమ కుటుంబాలకు పునరావాసం కల్పించడంలోనూ, ఉద్యోగం, ఉపాధి కల్పించడంలోనూ సంస్థ పూర్తిగా అన్యాయం చేస్తోందని, మాకు న్యాయం జరగకుండా అడ్డుపడుతున్నారని ఎండీకి తమ బాధలు వివరించారు. 2022 నవంబరు 17 తేదీ గోడ కూలి మృతి చెం దిన బాబు కుటుంబానికి ఇప్పటి వరకు శాశ్వత ఉద్యోగం కల్పించలేదన్నారు. డేంజర్‌జోన్‌లో ఉండే కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతి వాడ గ్రామాలకు చేసిన ఏర్పాట్లు తమకు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. తమ గ్రామా ల తరలింపులో మొదట ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆర్ఆర్ చట్టం ప్రకారం ప్రస్తుత రేట్లలో 50 శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే మైనింగ్ ప్రక్రియను అడ్డుకుంటామని గ్రామస్థులు హెచ్చరించారు. సమస్యలపై సోమవారం సమీక్ష నిర్వహిస్తామని ఎండీ వెంకటరెడ్డి హామీ ఇవ్వడంతో గ్రామస్థులు వెనుదిరిగారు. కార్యక్రమంలో సీపీవో సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పోకూరు సుబ్రహ్మణ్యం, అనిల్ స్వామి, మురళి, రాధమ్మ, బొక్కసం అనిల్‌కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అది మెగా కాదు.. దగా డీఎస్సీ

- నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ధ్వజం

పీలేరు, ఫిబ్రవరి 3: రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిరుద్యోగులను మరోసారి మోసం చేయడానికి మెగా డీఎస్సీ పేరుతో సీఎం జగన్ మరోసారి మోసానికి తెరతీశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. తాను అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని మభ్యపెట్టారని గుర్తు చేశారు. ఐదు జనవరి నెలలు వచ్చి వెళ్లినా ఇన్నాళ్లు పోస్టుల భర్తీ గురించి పట్టించుకోకుండా మళ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగులపై వల వేశారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 50 వేల 892 టీచరు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్రం గుర్తించిందని, ఇప్పుడు ముఖ్యమంత్రి కేవలం 6100 పోస్టుల భర్తీకి డీఎస్సీని నిర్వహిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ విధమైన నోటిఫికేషన్లు ఇవ్వడం నిరుద్యోగులను తప్పుదోవ పట్టించడమేనని స్పష్టం చేశారు. జాబ్ క్యాలెండరు ప్రకటించి 2.32 లక్షల ఉద్యోగాల భర్తీ ఏమయిందని ప్రశ్నించారు. ఉద్యోగాలు రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 1745 మంది నిరుద్యోగులు జీవితం మీద విరక్తితో బలవన్మరణాలకు పాల్పడ్డారన్నారు. పేద ప్రజల నిత్యావసరాల ధరలు ఇష్టానుసారం పెంచేసి, కల్తీ మద్యం అమ్మకాలతో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని కోరారు.

## అవకతవకలు లేకుండా పంపిణీ

**రేషన్ పంపిణీని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్**



రేషన్ పంపిణీని తనిఖీ చేస్తున్న జేసీ గణేశ్‌కుమార్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 3: అవకతవకలు లేకుండా ప్రజలకు రేషన్ పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పులివెందుల ఆర్డీవో వెంకటేశులుతో కలిసి జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించాలన్నారు. ప్రతి ఒక్కరికీ అందాలన్న లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. తూకాల్లో తేడాలు వస్తున్నాయని ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి జగనన్న హౌసింగ్ లేఅవుట్‌కు సంబంధించి కొత్తగా అర్హులైన వారికి ఆన్‌లైన్‌లో ఎక్కించాల్సిన విషయంపై సబ్ రిజిస్ట్రార్ నజీర్‌తో మాట్లాడారు. ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుజీత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే టీడీపీ లక్ష్యం

● ప్రతి మహిళకు సంక్షేమ పథకం ● టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3:యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే టీడీపీ లక్ష్యమని కడప నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. ప్రతి మహిళకు సంక్షేమ పథకం ఇచ్చేలా టీడీపీ కార్యాచరణ రూపొందించిందని స్పష్టం చేశారు. శనివారం కడప నగరం 7వ డివిజను శంకరాపురంలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంచిపెట్టారు. అలాగే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు సీఎం కావడం ఈ రాష్ట్రానికి అత్యంత అవసరమన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనతో పాటు మహిళలకు అనేక సంక్షేమ పథకాలు, రైతులకు అనేక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఇదంతా చం ద్రబాబుతోనే సాధ్యమన్నారు. ప్రజలందరూ టీడీపీకి ఓటు వేసి అత్యంత మెజార్టీతో గెలిపించి చంద్రబాబును మళ్లీ సీఎం చేయాలని కోరారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ, నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, నాయకులు రవిశంకర్‌రెడ్డి, యా టగిరి, ప్రసాద్, ప్రేమ్‌కుమఆర్, ట్రాన్స్‌పార్మర్ శ్రీను, చిన బాబు, మాసాపేట శివ, వరద పార్వతి, కిరణ్‌యాదవ్, రామాంజనేయులు, జనసేన, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మహిళలతో మాట్లాడుతున్న మాధవీరెడ్డి

# వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి నిర్వీర్యం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, ఫిబ్రవరి 3 : వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి నిర్వీర్యం అయిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి ధ్వజమెత్తారు. శనివారం గుర్రంపాడు పంచాయతీలోని నజీర్ బేగ్‌పల్లె, గుర్రంపాడు, హరిజనవాడ ప్రాంతాల్లో బాబుతో భవిష్యతు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి వైసీపీలో ప్రజలకు జరిగే అన్యాయం, పెంచిన చార్జీలు, పెరిగిన ధరలను వివరించారు. అలాగే గత ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎన్ని సంక్షేమ పథకాలు అందాయి, గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు, సాగునీరు. ఇతరత్నా అభివృద్ధి పనులు, అందిన సంక్షేమ పథకాలు, నిరుద్యోగ యువతను ఆదుకున్నది, ఎన్ని రకాల ఉపాధి అందింది తదితర విషయాలను వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్‌సిక్స్ పథకాలు ప్రతి ఇంటికీ అందిస్తామన్నారు. ఏడాదికి రూ.20వేలు వ్యవసాయానికి పెట్టుబడిగా ఉచితంగా ఇస్తామన్నారు. ఇంకా అనేక పథకాలు అందిస్తామన్నారు. అందుకే టీడీపీని ఆదరించి, గెలిపించి చం ద్ర బాబును సీఎం చేయాలని కోరారు. గ్రామం లో టీడీపీకి పట్టు ఉందని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు.


గుర్రంపాడులో టీడీపీ నేత పుత్తా సమక్షంలో పార్టీలో చేరిన మైనార్టీలు

**టీడీపీలో మైనార్టీ కుటుంబాలు చేరిక**

పుత్తా సమక్షంలో నజీర్‌బేగ్‌పల్లెలో దాదాపు 72 కుటుంబాలు, అలాగే అలాగే గుర్రంపాడులో 28 కుటుంబాలు టీడీపీ కండువా వేసుకున్నాయి. వారికి పుత్తా కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ వలంటీరు గంగాధర్ మైనార్టీ యువనేత ఇలియాస్‌లు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముండ్ల శ్రీనివాసులరెడ్డి, జిల్లా కార్యాలయ కార్యదర్శి ముక్తియార్ ఆధ్వర్యంలో మైనార్టీ కుటుంబాలు పార్టీలో చేరాయి. కార్యక్రమంలో గ్రామ సీనియర్ నేతలు రమణారెడ్డి, రఘురాం రెడ్డి, వీరయ్య ఆచారి, రామమూర్తిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గన్నేపాటి మల్లేష్, ఓబులేసు, గన్నెపాటి సుబ్బరాయుడు, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, మైనార్టీ జిల్లా నాయకులు షబ్బీర్‌హుసేన్, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, మండల ఉపాధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి , రైతు విభాగం నాయకులు అల్లాడు రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోంది

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3 : రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు మాత్రం ఆంధ్ర రాష్ట్రంలోనేఉంటోందని చెప్పారు. వైసీపీ బడానేతల ప్రమేయంతోనే గంజాయి మాఫియా విచ్చలవిడిగా సాగుతోందని తెలిపారు. శనివారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక ఉగ్రవాదిగా సీఎం జగన్ కావడంతో రాష్ట్రంలో వనరులన్నీ దోపిడీకి గురవుతున్నాయన్నారు. యథేచ్ఛగా వ్యవస్థలన్నీ విధ్వంసంతో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాయన్నారు. టీడీపీ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండేదన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు మన రాష్ట్రంలో ఉంటున్నాయన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగాలు లేక తప్పుడు దోవలో వెళుతున్నారన్నారు. గంజాయి మాఫియాకు వైసీపీ బడా నేతల ప్రమేయం ఉందని, అందుకే పోలీసులచే అక్రమ రవాణా చేయిస్తున్నారని ఆరోపించారు. చివరికి రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా కో ఆర్డినేటరు జనార్ధన్, బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపిశెట్టి నాగరాజు, నాయకులు గంధం రాంప్రసాద్, ఈశ్వరయ్య, ఖాసిం పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

## ఘనంగా ఆపస్ ఆవిర్భావ దినోత్సవం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3 : ఆపస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కడప నగంలో రాష్ట్ర సహాయ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆపస్ జెండా ఎగురవేసివందన సమర్పణ చేశారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. విద్యార్థుల్లో జాతీయ భావాలు పెంపొందించే విధంగా విద్యాబోధన చేయాలని, పాల్గొన్న సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, మీడియా ఇన్‌చార్జ్ బాలక్రిష్ణుడు, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి ప్రభాకరరెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


జెండా వందనం చేస్తున్న ఆపస్ నాయకులు

## కేఎస్ఆర్ఎంకు స్టూడెంట్ చాప్టర్ అవార్డు

సీకేదిన్నె, ఫిబ్రవరి 3: కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలకు 2023 సంవత్సరానికిగాను అత్యుత్తమ స్టూడెంట్ చాప్టర్ అవార్డు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఇండియన్ కాంక్రీట్ ఇన్సిస్ట్యూట్, అల్ట్రాటెక్ ఇన్సిస్ట్యూట్ సంయుక్తంగా ఐసీఐ అల్రాటెక్ అవార్డ్స్ 2023గాను కడపలోని తమ కళాశాల ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కళాశాల ఎండీ డాక్టర్ చంద్ర ఓబుళరెడ్డి మాట్లాడుతూ విజయవాడలో సిద్దార్థ ఇన్సిస్ట్యూట్ ఆఫ్ టె క్నాలజీ ప్రిన్సిపల్ శివాజీబాబు, ఐసీఐ ఏపీ చాప్టర్ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్ చేతుల మీదుగా అవార్డు అందుకోసం ఎంతో గర్వకారణమన్నారు. కాంక్రీట్ టెక్నాలజీలో శ్రేష్ఠత, సృజనాత్మకత పనితీరు ఆధారంగా ఈ అవార్డు రావడంపట్ల కళాశాల యాజమాన్యం విద్యార్థుల అంకితభావానికి నిదర్శనమని, దీన్ని నిలబెట్టుకుంటూ ఆదర్శంగా నిలుస్తామన్నారు.



ఐసీఐ అల్ట్రాటెక్ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న కందుల గ్రూప్ విద్యాసంస్థల ఎండీ డాక్టర్ చంద్ర ఓబుళరెడ్డి (నాని)

# అనుగ్రహ పరిపూర్ణురాలు లూర్దుమాత

కడప (కల్చరల్), ఫిబ్రవరి 3: సకల మానవాళికి అనుగ్రహాలను అందించే అనుగ్రహ పరిపూర్ణురాలు లూర్దుమాత అని బద్వేల్ విచారణ గురువు ఫాదర్ గొడుగునూరు విజయరావు పేర్కొన్నారు. మరియాపురం లూర్దుమాత తిరుణాల నవదిన పూజా ప్రార్థనల్లో భాగంగా రెండవ రోజైన శనివారం స్థానిక లూర్దుమాత చ ర్చి ఆవరణలో ఫాదర్ ఆరోగ్యరాజు దివ్య బలిపూజ సమర్పించగా విజయరావు దైవ సందేశం గావించారు. భూమిపై జీవిస్తున్న జనులందరికీ లూర్దుమాత అనుగ్రహం అందించి పరిపూర్ణులుగా చేస్తుందన్నారు. పూజ ప్రారంభంలో బద్వేల్ విచారణకు చెందిన విశ్వాసులు ప్రత్యేకంగా అలంకరించబడిన లూర్దుమాత తేరును మరియాపురం వీధుల గుండా జపాలను జపిస్తూ ప్రదక్షిణ చేశారు. మరియాపురం విచారణ గురువు బిరుసు రాజా, సహాయక గురువు అరుణ్, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ప్రసాదరావు, ఎంపిఎస్ఎస్ఎస్ డైరెక్టర్ బాలరాజు,తో పాటుగా పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.


మరియతల్లి ఊరేగింపు నిర్వహిస్తున్న విశ్వాసులు

## 'సోషల్ మీడియాతో జాగ్రత్తగా వ్యవహరించాలి'

వల్లూరు, ఫిబ్రవరి 3 : సోషల్ మీడియాతో జాగ్రత్తగా వ్యవహరించాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు పుత్తా నరసింహారెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని మండలంలో వారు ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా సోషల్ మీడియా గురించి ప్రజలకు సూచించారు. మండల కన్వీనరు నాగేశ్వర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, హరిక్రిష్ణ, సద్దాం హుసేన్, చిట్టిబాబు, మదన్‌మోహనరెడ్డి, యువకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'తహసీల్దారు హత్య దారుణం'

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 3: విశాఖపట్నంలో తహసీల్దారు రమణయ్య హత్య దారుణమని, హత్యకు కారకులను కఠినంగా శిక్షించాలని కడప రెవెన్యూ అసోసియేషన్ కడప డివిజన్ అధ్యక్షుడు ప్రసాద్‌రావుప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. శనివారం తహసీల్దారు హత్యకు నిరసనగా కడప ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏపీ రెవెన్యూ అసోసియేషన్ కడప డివిజన్ నాయకులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రంగనాథ్, తహసీల్దారు వెంకటస్వామి, డిప్యూటీ తహసీల్దారు తిరుమలబాబు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఆడుదాం ఆంధ్రాలో మా క్రికెట్ జట్టుకు అన్యాయం'

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 3: ఆడుదాం ఆంధ్రాలో మా క్రికెట్ జట్టుకు అన్యాయం జరుగుతోందని వల్లూరు మండల సచివాలయ క్రికెట్ జట్టు సభ్యులు పేర్కొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ జిల్లా స్థాయిలో మట్టిలో మాణిక్యాల్లాగా దాగి ఉన్న క్రీడాకారులను వెలికితీసి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో వైసీపీ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను చేపట్టిన సంగతి తెలిసిందే అన్నారు. అందులో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో వివిధ క్రీడాపోటీలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా కడప జిల్లా స్థాయిలో చేపట్టిన క్రికెట్ పోటీలలో ఇటు వల్లూరు మండల సచివాలయం జట్టుతో పాటు ప్రొద్దుటూరు లైట్‌పాలెం జట్టు లీగ్ మ్యాచ్‌లలో ప్రత్యర్థి జట్లపై గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నట్లు వెల్లడించారు. ఆ మేరకు శనివారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ జట్టు క్రీడాకారులు శ్రీనివాసులురెడ్డి, రామకోటిరెడ్డి, చరణ్ ధనుంజయరెడ్డి మాట్లాడారు. కడప నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తమ జట్టు ఖచ్చితంగా విజయం సాధించే దశలో ఉండగా తమ జట్టులో ఎంప్లాయి క్రీడాకారుడుగా ఆడుతున్నారనే నెపంతో ప్రత్యర్థి జట్టు ఆట ఆడకుండా మైదానం నుంచి వెళ్లిపోవడం దారుణమన్నారు. సచివాలయ వలంటీర్లు నకిలీ కార్డులు సృష్టించారని ఆరోపించారు. ఆ జట్టు కూర్పులో ప్రొద్దుటూరు శాసనసభ్యులుతో పాటు అక్కడి మునిసిపల్ కమిషనర్, ఆయన సతీమణి పాత్ర కీలకంగా ఉందని ఆరోపించారు. మా జట్టుకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా అధికారులను కోరారు.

## మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ : టీడీపీ

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 3: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వదిలింది మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ అంటూ సింహాద్రిపురం మండల కన్వీనర్ మారెడ్డి జోగిరెడ్డి అన్నారు. పులివెందుల టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50892 ఖాళీలు ఉంటే 6100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను వచించడమే అన్నారు. డీఎస్సీ పేరుతో ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే జగన్‌రెడ్డి కొత్త డ్రామాకు తెరతీశారని ఆయన అన్నారు. నిరుద్యోగుల్ని మరోసారి వంచించడానికి సిద్దమయ్యాడన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా చేసిన ఏటా మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండర్ 2.32లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఏమయ్యాయో జగన్ సమాధానం చెప్పాలన్నారు. కల్తీ మద్యం అమ్మకాలతో మద్యాంధ్రప్రదేశ్‌గా, గంజాయి ఉత్పత్తిలో నంబర్ వన్‌ఆ రాష్ట్రాన్ని చేసిగంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌రెడ్డిదే అన్నారు. టీడీపీ రాష్ట్రాన్ని పెట్టుబడులకు హబ్‌గా మార్చితే జగన్ రెడ్డి రాష్ట్రాన్ని గంజాయికి హబ్‌గా మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి అమర్, నాయకులు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ మారెడ్డి జోగిరెడ్డి

## ఓడించేందుకు ప్రజలు సిద్ధం: ఆమ్ ఆద్మీ

వేంపల్లె, ఫిబ్రవరి 3: రాష్ట్ర ప్రజలను అప్పుల ఊబిలో నెట్టేసి మేము సిద్ధం అంటూ పెద్దపెద్ద బ్యానర్లు వేసుకుంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో ఆర్డినేటర్ రహమతుల్లా అన్నారు. వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంపూర్ణ మద్యపాన నిషేధమని చెప్పి మద్యాన్ని ఏరులైపారిస్తున్నారన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ రాజగ్, మండల సభ్యులు షఫి, ఖదీర్ సలీమ్ అహమద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

## గండి క్షేత్రంలో హనుమాన్ లీలా విలాసంపై ప్రవచనాలు

చక్రాయపేట, ఫిబ్రవరి 3: గండి క్షేత్రంలో హనుమాన్ లీలా విలాసం, దేవతా విజ్ఞానం గురించి శనివారం ప్రవచనాల కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. నైమిషారణ్యం పీఠాధిపతి, హిందూ ధార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బాలబ్రహ్మానంద సరస్వతి స్వామీజీ ప్రచనాలు వినిపించారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ప్రవచనాలు విన్నారని ఆయన పేర్కొన్నారు. ముందుగా బాలబ్రహ్మానందసరస్వతి స్వామీజీకి ఆలక అసిస్టెంట్ కమీషనర్ ముకుందరెడ్డి, చైర్మన్ కావలి క్రిష్ణతేజ స్వాగతం పలుకగా ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్‌లు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతంపలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ప్రవచనాలు వినిపిస్తున్న బాలబ్రహ్మానంద సరస్వతి స్వామీజీ

## వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 3 : యువత ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని లక్ష్యసాధనకై పట్టుదలతో సాధించాలని జిల్లా ఎంప్లాయిమెంటు అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం అలంఖాన్‌పల్లె నందు గల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నతపాఠశాలలో వ్యక్తిత్వ వికాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యువత ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని, అందులో భాటగంగా విద్య, వైజ్ఞానిక క్రీడల సామాజిక సాంస్కృతిక విషయాలకు సంబంధించి యువత అబివృద్ధికి అనుగుణంగా కఠోర దీక్షతో లక్ష్యాలు చేరుకోవాలని చెడు అలవాట్లకు అలవాటు పడకుండా ఉండాలన్నారు. యువత కక్షలకు గొడవలకు దూరంగా ఉండాలని, ఆత్మహత్యలు చేసుకోరాదన్నారు. ప్రధాన ఉపాధ్యాయులు మునిరత్నమ్మ, స్టెప్ మేనేజరు సుబ్బరాయుడు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సురేష్‌కుమార్

## ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: పీడీఎస్‌యూ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3 : జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యంపై విచారన చేపట్టి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌ఐవో కార్యాలయంలో ఆర్‌ఐవో వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి తక్షణం సంబంధిత జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.


ఆర్‌ఐఓకు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

## అదనపు ఎస్పీకి సానె శ్రీనివాసులు సత్కారం

కడప (క్రైం), ఫిబ్రవరి 3: అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన లోసారి సుధాకర్‌ను శనివారం వ్యాపారవేత్త సానె శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూల బొకేతో సత్కరించారు. వారిరువురికి సుమారు 20 సంవత్సరాలుగా పరిచయం ఉండటంతో చర్చించుకున్నారు. కాగా కడప నగరంలో గల అన్ని పోలీస్‌స్టేషన్‌లలో ఉచితంగా వాహనాల పార్కింగ్‌ను శ్రీనివాసులు ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే.


సుధాకర్‌ను సత్కరిస్తున్న శ్రీనివాసులు

## కోర్టులో ఉన్న వాటిని కూడా పగులగొడతారా: బీజేపీ

వేంపల్లె, ఫిబ్రవరి 3: ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కోర్టులో ఉన్న వాటిని కూడా పగులగొడతారా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. న్యాయస్థానంపై గౌరవం లేకుండా పోయిందని ఆరోపించారు. వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ రోడ్ల విస్తరణ నెపంతో ఆర్టీసీ ఆధీనంలో ఉన్న దుకాణానికి సంబంధించిన రేకులను గోడలను పగులగొట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. వైసీపీనాయకుల అడుగులకు మడుగులొత్తుతూ కోర్టులో ఉన్న దానికి ఒక వారం రోజుల ముందు నోటీస్ ఇవ్వకుండా అర్ధాంతరంగా పగలగొట్టడం దారుణమన్నారు. దీని వల్ల రెండు లక్షల రూపాయల వరకు నష్టం జరిగిందని ఎవరుబాధ్యత తీసుకుంటారో చెప్పాలని ప్రశ్నించారు. కోర్టులో ఉన్న వాటికే రక్షణలేకుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, బీజేవైఎం జిల్లా కార్యదర్శి చంద్ర, కిరణ్‌కుమార్‌రెడ్డి, అంజి, చరణ్, రంజిత్, హరి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.


వేంపల్లెలో మాట్లాడుతున్న శశిభూషణ్‌రెడ్డి

## సమాజం పట్ల అవగాహన కలిగించే బాధ్యత తల్లిదండ్రులదే

● అనుపమానందాజీ మహరాజ్

వేంపల్లె, ఫిబ్రవరి 3: పిల్లలకు సమాజం పట్ల అవగాహనను కలిగిస్తూ పెంచే బాధ్యత తల్లిదండ్రులదేనని కడప రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు శ్రీమత్ అనుపమానందాజీ మహరాజ్ అన్నారు. శనివారం వేంపల్లె స్వామి వివేకానంద ఉన్నత పాఠశాల 23వ వార్షికోత్సవ సమావేశంలో తల్లిదండ్రులకు, విద్యార్థులకు బోధనలు, సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ కష్టం తెలియకుండా పెంచాము అని తల్లిదండ్రులు గొప్పలుచెప్పకుండా కష్టమేంటో తెలిసేలా పెంచాలని సూచించారు. సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జ్ఞానానికి, ఏకాగ్రతకు స్వామి వివేకానంద మారుపేరన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందినవ ఇద్యార్థులకు, పదవ తరగతిలో గరిష్ట మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ఎంఈఓ సాదిక్, ఎంఈఓ-2 స్టాలిన్, పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనుపమానందాజీ మహరాజ్

## 'మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

చక్రాయపేట, ఫిబ్రవరి3: మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం చక్రాయపేట మండలంలోని నారపురెడ్డిగారిపల్లెలో మోరం హరినాథరెడ్డి రూ.2కోట్లతో నిర్మించిన పలు సచివాలయ భవనలను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రమైన చక్రాయపేటలోని వేంకటేశ్వర రాచరాయ దేవస్థానాలకు సంబంధించిన కోటి రూపాయలతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడ జరిగిన ఆసరా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైవీయూ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షావల్లిఖాన్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3 :వైవీయూ పీజీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ప్రొఫెసర్‌గా చీఫ్ సూపరింటెండెంట్ ఆఫ్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినేషన్‌గా ప్రొఫెసరు పి.ఎస్.షావల్లిఖాన్‌ను నియమించారు. వృక్ష శాఖ ప్రొఫెసరుగా పనిచేస్తున్న షావల్లికి శనివారం ప్రొఫెసరు చింతా సుధాకర్ నియామకపత్రం అందించారు. ఈ స్థానంలో పనిచేస్తున్న శ్రీనివాస్ పదవీకాలం పూర్తి కావడంతో ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ బాధ్యతతో పాటు యూనివర్సిటీ వసతిగృహాల అదనపు చీఫ్ వార్డెన్ బాధ్యతలు కూడా చూడాలని నియామక ఉత్తర్వుల్లో సూచించారు. రిజిస్ట్రారు వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందిస్తున్న వైస్ చాన్సలర్

## 30 కుటుంబాలు టీడీపీలో చేరిక

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు నాగులకట్ట కాలనీలోని బుడగ జంగం కాలనీలో శనివారం పలువురు పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరినవారికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కండువా వేసి ఆహ్వానించారు. చేరినవారిలో బుడగజంగం కాలనీ నల్లప్ప, రాజశేఖర్, వెంకటరాముడు, శంకరయ్య, గణపయ్య, రాముడు, నారాయణ, రమేష్, బాలరంగయ్య, శివయ్య, శీనప్ప, గంగరాజు, సంజీవ, శ్రీరాములు, ప్రదీప్, మహేంద్ర, విజయ్, నాగలక్షుమ్మ, నాగమ్మ, అంజనమ్మ, నల్లమ్మ, పద్మావతి, వరాలమ్మ, తదితరులు 30 కుటుంబాలు చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, నాగేశ్వరరెడ్డి, ముర్రా బ్రదర్స్, హనుమంతరెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రైవేటు ఉపాధ్యాయులను మోసం చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ'

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3: ప్రైవేటు ఉపాధాయయులను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి గెలిచి ఏడాది కావస్తున్నా ఇంతవరకు వారిని పట్టించుకోలేదని గెలిచిన తర్వాత మోసం చేశారని జమ్మలమడుగు సీపీఐ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. శనివారం జమ్మలమడుగు ఎన్జీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని, ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పి ఓట్లు దండుకున్నారన్నారు. అప్పటి నుంచి వారి సమస్యలను పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి నామమాత్రంగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 3 : బద్వేలు మున్సిపాలిటీలో నెలకొన్న మౌలిక సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యలు పరిష్కరించాలని పౌరవేదిక కార్యదర్శి గురుమూర్తి, కన్వీనరు నానబాల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనరుగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ క్రిష్ణకు పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ పట్టణ అధ్యక్షుడు సత్తార్, అన్వర్, రామసుబ్బయ్య, రమణయాదవ్, నాగార్జున, షేక్ మహబూబ్‌బాషా, రసూల్, బాల నరసింహులు, రాజగోపాల్, రాజాగౌస్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ నజీర్ సేవలు మరువలేనివి

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 3 : ప్రొద్దుటూరు తహసీల్దారు నజీర్ అహ్మద్ సేవలు మరువలేనివని రెవెన్యూ అధికారులు కొనియాడారు. శనివారం నజీర్‌అహ్మద్ నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డకు బదిలీ అయిన సందర్భంగా వీడ్కోలు సభ జరిపారు. తహసీల్దారు నజీర్‌అహ్మద్‌ను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీ మనోహర్‌రెడ్డి ,డిప్యూటీ తహసీల్దార్లు సుదర్శన్,అజయ్‌బాబు, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, ఎన్నికల సీనియర్‌అసిస్టెంట్ జహీర్, వీఆర్వో, సర్వేయర్లు పాల్గొన్నారు.



తహసీల్దారును సన్మానిస్తున్న అధికారులు

## ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3: జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నుంచి తాడిపత్రి రూట్‌లో ప్రయాణికులు బహుమతులను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ప్రవీణ్, అసిస్టెంట్ డీఎం పెద్దిరాజు సూచించారు. శనివారం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో 1.9.2023 నుండి 3.2.2024 వరకు తాడిపత్రి రూట్‌లో ప్రయాణం చేసిన వారికి లక్కీడిప్‌లో గెలుపొందిన ప్రయాణికులకు బహుమతులు అందించారు. అందులో మొదటి బహుమతి పి.లక్ష్మీదేవి (జమ్మలమడుగు), రెండో బహుమతి పెద్దగురివిరెడ్డి (చిన్నకొమెర్ల), మూడో బహుమతి మహమ్మద్‌కాశీం (ఎర్రగుంట్ల) తదితరులకు గిఫ్ట్‌బాక్సులు అందజేశారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు, ఫిబ్రవరి 3: 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా శనివారం బద్వేలు పట్టణంలో ఆర్టీవో వి.శేఖర్‌రావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని ఆర్‌టీవో శేఖర్‌రావు, సీఐ యుగంధర్ జెండా ఊపి ప్రారంభించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యమంలో అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, ఆర్‌టీసీసిబ్బంది, డ్రైవింగ్ పాఠశాల విద్యార్థులు, ట్యాక్సీ స్టాండు డ్రైవర్లు, వివిధ షోరూం యాజమాన్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 43మద్యం బాటిళ్లు స్వాధీనం : కేసు నమోదు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 3 : వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 43 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం రంపాడు రోడ్డు వద్ద పరశురాం అనే వ్యక్తి వద్ద నుంచి 16 మద్యం బాటిళ్లు, సీతారాంపురం క్రాస్ రోడ్డు వద్ద టేకూరుపేట వెంకటేశ్వర్లు, నారాయణ అనే వ్యక్తుల నుంచి 27 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

# అప్పుల ఆంధ్రను కాపాడేది చంద్రబాబే



ప్రొద్దుటూరు, మైదుకూరు, పోరుమామిళ్లలలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రవీణ్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, బొజ్జ రోశన్న

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 3 : జగన్ దివాలా తీయించి అప్పుల ఆంధ్రగా మార్చాడని దీన్ని కాపాడేది చంద్రబాబు ఒక్కరేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు.శనివారం 4వవార్డు లోని పెద్దమ్మ చెట్టు ఏరియాలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందస్తు మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కాకుమాని ఆనంద్, సీతారామిరెడ్డి,తాటి శ్రీను, మండల టీడీపీ కన్వీనర్ బాబుల్‌రెడ్డి, బండి భాస్కర్‌రెడ్డి ఆవుల దస్తగిరి, పొట్టిపాటి గంగాధర్ పాల్గొన్నారు.

**మౌనికారెడ్డి ఆధ్వర్యంలో..:** టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి ఆధ్వర్యంలో 35 వార్డు వినాయకనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జులు సుబ్బు, రాఘవ, పల్లా లక్ష్మీదేవి, కృష్ణారెడ్డి పాణ్యం సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ప్రొద్దుటూరులో వైసీపీని మట్టికరిపిస్తాం : వరద

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 3 : ప్రొద్దుటూరులో వైసీపీని మట్టికరిపిస్తామని మాజీ ఎమ్మెల్యేనంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం దొరసానిపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో వందలాది మందికార్యకర్తల నడుమ నిర్వహించారు. ఆయన భారీ గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి ,మాజీ మునిసిపల్ ఛైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పాతకోట భాస్కర్‌రెడ్డి, మాడెం సుధాకర్‌రెడ్డి,వరదసుధాకర్, శీపాల శివ, వరద శివ, జక్క శింగరయ్య, వరద ఆంజనేయులు, ఎంకాల సుధాకర్‌రెడ్డి,చెంద్రాయుడు, గుర్రం వెంకట సుబ్బయ్య, బోసం గురివిరెడ్డి, కొప్పురమేష్ ,మాజీ కౌన్సిలర్ వద్దిబాలుడు తదితరులు పాల్గొన్నారు.

**దువ్వూరు (మైదుకూరు)..:** రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబుతోనే గ్యారెంటీ అని ప్రజలు ఏకపక్షంగా ఇప్పటికే నిర్ణయించుకున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం ఆయన దువ్వూరు మండలంలోని చిన్న బాకరాపురం, మూడిండ్లపల్లె, రామ్‌సాయినగర్ గ్రామాలల్లో ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పుట్టాకు గజ పూలమాలవేసి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోరెడ్డి రమణారెడ్డి నాయకులు సంజీవరెడ్డి, రాంబాబు, లక్షమయ్య, కాంతారావు, రాఘవేంద్ర, వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ మల్హోత్ర పాల్గొన్నారు.

**పోరుమామిళ్ల..:** చంద్రబాబు తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. శనివారం పోరుమామిళ్లలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా రంగసముద్రం పంచాయతీ పరిధిలో 6, 79 పోలింగ్ బూత్‌లలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారావు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చెరకూరి చెన్నరాయుడు, మాజీ వైస్‌ఛైర్మన్ ఎస్ఎం బాషా, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, సీతాబాలాజీ, కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, ఇమాంహుసేన్, శెట్టెం ప్రతాప్, సంచర్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మౌలాలి, రంతుల్లా, సుబ్బారావు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కలసపాడు..:** మండలంలోని దూలంవారిపల్లెలో శనివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి భద్రయ్య, హరిక్రిష్ణ, మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, సత్యం, భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలవెంకటరెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

**బద్వేలు టౌన్..:** రాష్ట ప్రజల భవిష్యత్తు మారాలంటే చంద్రబాబు సీఎం కావాలని టీడీపీ బద్వేలు మండల పార్టీ అధ్యక్షులు టీవీఎస్ రవి, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి అన్నారు. శనివారం శంకరాపురంలో ఇంటింటికీ బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రోశేఖర్‌రెడ్డి, రామచంద్ర, బొజ్జ అరుణ, ఆదిలక్షుమ్మ, మస్తాన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో వరదకు గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం



బద్వేలులోప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

# మెగా డీఎస్సీ పేరుతో దగా : లింగారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 3 : ఎన్నికలు వస్తుండటంతో వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో 6100 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ప్రకటించడం నిరుద్యగులను దగా చేయడమేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి మండిపడ్డారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రం లెక్కల ప్రకారం రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. అధికారంలోకి వస్తే 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి సీఎం జగన్ నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక 1740 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఐదేళ్లలో కడప స్టీల్ ప్లాంట్‌కు కాంపౌండ్ కూడా పూర్తి చేయలేకపోయారన్నారు. కడప-బెంగళూరు రైల్వే లైన్‌కు కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ప్రశ్నించలేని స్థితిలో వైసీపీ ఉందని విమర్శించారు. సమావేశంలో టీడీపీ నాయకులు గుర్రప్ప, సిద్ధయ్య, సుబ్బరాజు, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లెల లింగారెడ్డి

## 40 కుటుంబాలు టీడీపీలో చేరిక

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 3: జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డికి శనివారం అపూర్వ స్వాగతం లభించింది. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా సి.భూపేశ్‌రెడ్డి ఎర్రగుంట్ల శాంతినగర్, ఏరువాకగంగమ్మ ఆలయ వీధుల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీమేనిఫెస్టో తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్ వద్ద నుంచి భూపేశ్‌రెడ్డికి పూలతో స్వాగతం పలికారు. మడూరు బాషా ఆధ్వర్యంలోని సుమారు 40 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి భూపేశ్‌రెడ్డి కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు.ఈకార్యక్రమంలో మండల ఇన్‌చార్జి సి.జ యరామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకటశివారెడ్డి ముస్లింమైనార్టీ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన కార్యకర్తలు ఇతరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మన ఆరోగ్యం -మన చేతుల్లోనే



హెల్త్‌క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు, ఫిబ్రవరి 3: బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల ఎస్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చిన్నకేశంపల్లె లో చేపట్టిన స్పెషల్ క్యాంపు శనివారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య పరిరక్షణ చైతన్య సదస్సును నిర్వహించారు. అనంతరం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామస్థులకు షుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమాకాంత్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భూపోరాటానికి సిద్ధం కావాలి

గోపవరం, ఫిబ్రవరి 3 : మండలంలోని ప్రజలందరూ భూపోరాటానికి సిద్ధం కావాలంటూ గోపవరం మండల సీపీఐ కార్యదర్శి గూడూరు పెంచలయ్య అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని, గతంలో ఆర్డీవో, తహసీల్దారుకు వినతిపత్రాల ద్వారా తెలిపామని ఎటువంటి స్పందన లేకపోవడంతో భూపోరాటానికి సిద్ధమయ్యామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు మండల కార్యదర్శి ఖాదర్‌బాషా, తిరుపాల్ వెంకటేశ్, పెంచలయ్య నాగవేణి పాల్గొన్నారు.

## దుమ్ము తొలగింపు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 3 : పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలో రోడ్డు విస్తరన పనుల్లో భాగంగా మట్టి, దుమ్ము ఎక్కువ కావడంతో సర్పంచ్ యనమల సుధాకర్ పారిశుద్య కార్మికులతో పరిసరాలను పరిశుభ్రం చేయించారు. శనివారం ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిసరాలు శుభ్రం చేయించారు.

## ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల గడువు పెంపు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 3 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ స్టడీ సెంటర్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు ఫిబ్రవరి 16వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరంలో చేరడానికి ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ పాస్ అయిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఉన్న ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

## ఉర్దూ పాఠశాలకు మంజూరైన నిధులు విడుదల చేయాలి

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 3 : పట్టణంలోని సిద్దవటం రోడ్డు మహబూబ్‌నగర్‌లో ఉన్న ఉర్దూ ఉన్నత పాఠశాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆవాజ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ఏ సత్తార్, అన్వర్‌బాష కోరారు. శనివారం ఆవాజ్ కమిటి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాబుతారా, మస్తానయ్య, ఖాజాగౌడ్, కమాల్‌బాషా, రసూల్, అబ్దుల్‌రహీం పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయులకు 20 శాతం ఐఆర్ ప్రకటించాలి

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 3 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల షెడ్యూలు లోపు ఉద్యోగ ఉపాధ్యాయులు 20 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) తక్షణం ప్రకటించాలని డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను, జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎంవీఎస్ఆర్ జూనియర్ కళాశాలలో డెమోక్రటిక్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ అధ్యక్షతన జిల్లాకార్యవర్గ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే ఆర్థిక బకాయిలు తక్షణమే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు సుధాకర్‌రెడ్డి, రవి, రఘువర్ధన్, రాజా, సెల్వరాజా, ఆనంద్, శ్రీనివాసులు, సతీష్, విజయభాస్కర్, రామక్రిష్ణ, శివకుమార్, రమేష్, బాల ఓబన్న, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## రైతు మహిళా సంఘాల కార్యవర్గం ఎంపిక

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 3 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం ఉదయం రైతు మహిళా సంఘాల సమాఖ్య మహాసభను మండల సమాఖ్య ఏపీయం జి.ప్రకాశరావు పర్యవేక్షణలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభారాణి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశం లో 70 సంఘాల సంఘం లీడర్లు సమావేశానికి హాజరయ్యారు. అనంతరం 15 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరు రెడ్డయ్య, సీసీలు, గ్రామ సంఘం అసిస్టెంట్లు, మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభారాణి, కోశాధికారి నర్మద పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోంది

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 3 : రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యద ర్శి హరిప్రసాద్ ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు మాత్రం ఆంధ్ర రాష్ట్రంలోనేఉంటోందని చెప్పారు. వైసీపీ బడానేతల ప్రమేయంతోనే గంజాయి మాఫియా విచ్చలవిడిగా సాగుతోందని తెలిపారు. శనివారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక ఉగ్రవాదిగా సీఎం జగన్ కావడంతో రాష్ట్రంలో వనరులన్నీ దోపిడీకి గురవుతున్నాయన్నారు. యథేచ్ఛగా వ్యవస్థలన్నీ విధ్వంసంతో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాయన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు మన రాష్ట్రంలో ఉంటున్నాయన్నారు. గంజాయి మాఫియాకు వైసీపీ బడా నేతల ప్రమేయం ఉందని, అందుకే పోలీసులచే అక్రమ రవాణా చేయిస్తున్నారని ఆరోపించారు. మీడియా కో ఆర్డినేటరు జనార్ధన్, బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపిశెట్టి నాగరాజు, గంధం రాంప్రసాద్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



## 'బలోపేతం దిశగా బీజేపీ'

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 3 : భారతీయ జనతా పార్టీని అన్నివిధాలా బలోపేతం చేసేందుకు రాష్ట్ర నాయకత్వం అనేక సూచనలు ఇచ్చిందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ నెల 9, 10, 11 తేదీల్లో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించాలని తలపెట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తూ రైతు, యువ బృందాలు, అమరవీరుల కుటుంబాలు, స్వయం సహాయక బృందాలను కలవడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 3 : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. తెల్లవారుజామునే అభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

## అడ్వాణీకి భారతరత్న ఇవ్వడం హర్షణీయం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 3 : ఎల్‌కే అడ్వాణి గొప్ప దేశ భక్తుడని, ఆయనకు భారత రత్న అవార్డు ఇవ్వడం హర్షణీయమని జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్ బాలరంగయ్య అన్నారు. దేశభక్తులకు కేరాఫ్ ఆయనే అని సిద్ధాంత రాజకీయాల కోసం ఆయన పరితపించారన్నారు. ఆయనను వ్యతిరేకించే పార్టీల వారు కూడా ఆయనపై ప్రత్యేక అభిమానాన్ని చూపించేవారన్నారు.



# చంద్రబాబుతోనే క్రైస్తవుల అభివృద్ధి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులందరినీ నమ్మబలికి అభివృద్ధి చేస్తానని మాయమాటలు చెప్పి సమావేశాలు ఏర్పాటు చేసి అయిదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఏమాత్రం అభివృద్ధి చేయలేదని నియోజకవర్గ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు స్వామిదాస్ తదితరులు విమర్శించారు. శనివారం జమ్మలమడుగులో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి క్రిస్టియన్ మైనార్టీల నాయకులు కలిసి క్రైస్తవ మైనార్టీల సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి అమలు చేయలేక రద్దు చేసినందుకు గాను జమ్మలమడుగు టీడీపీ క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ టీడీపీ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమై పాత బస్టాండు గాంధీ విగ్రహం, అక్కడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రబాబు క్రైస్తవులకు చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఉపాధ్యక్షుడు చదిపిరాళ్ల రమేష్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, జంబాపురం రమణారెడ్డి, దేవగుడి యూత్ బృందం, కేకే ఖదీర్, పొన్నతోట శ్రీను, సంతోష్, మద్దిలేటి, జయచంద్ర, శంకర్, ఫిలిప్, నెల్సన్, నాగరాజు,పుల్లన్న,చెన్నయ్య,ఇమ్మానుయేల్, పుల్లన్న, గురప్ప, ప్రభాకర్, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న భూపేశ్‌రెడ్డి, క్రిస్టియన్ నాయకులు